క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్‌ఐలు


శివకుమార్ నల్లగొండ రూరల్

నల్లగొండక్రైం: నల్లగొండ రూరల్ ఎస్‌ఐగా జె. శివ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీస్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన భాస్కర్‌రెడ్డి రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్లగొండ వన్ టౌన్ నుంచి శివకుమార్ బదిలీపై నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు..


సైదాబాబు చిట్యాల

చిట్యాల: చిట్యాల పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా సైదాబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన రవి బదిలీపై నల్లగొండ వీఆర్‌కు వెళ్లగా.. ఆయన స్థానంలో నల్లగొండ నుంచి బదిలీపై సైదాబాబు చిట్యాలకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు మండల ప్రజలంతా సహకరించాలని కోరారు.

నార్కట్‌పల్లి ఎస్‌ఐ నర్ర అంతిరెడ్డి


నర్ర అంతిరెడ్డి నార్కట్‌పల్లి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి నూతన ఎస్‌ఐగా నర్ర అంతిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నల్లగొండ వీఆర్ నుంచి నార్కట్‌పల్లికి బదిలీపై వచ్చారు. కాగా గత 28 రోజులుగా నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ లేకపోవడంతో ఏఎస్‌ఐ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఎస్‌ఐ నర్ర అంతిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్ము యాదయ్య సన్మానించారు.

ఆధార్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి

చండూరు: మండల పరిధిలో మరో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నెర్మట గ్రామానికి చెందిన అడ్వకేట్ బొమ్మరగోని కిరణ్ కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలో ప్రస్తుతం ఒక్కటే ఆధార్ సెంటర్ ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కోవిడ్‌తో మరణించిన వైద్యులకు నేడు సంతాపం

నల్లగొండటౌన్: కోవిడ్ సమయంలో జిల్లాలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కోల్పోయిన వైద్యులకు మంగళవారం నల్లగొండ పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) భవనంలో సంతాపం ప్రకటించనున్నట్లు ఐఎంఏ నీలగిరి అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్లు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కుట్టు శిక్షణలోనూ నైపుణ్యం సాధించాలి

నార్కట్‌పల్లి: విద్యార్థినులు చదువుతో పాటు కుట్టు శిక్షణలోనూ నైపుణ్యం సాధించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కొమ్ము యాదయ్య అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తన సొంత ఖర్చులతో పాఠశాలకు కుట్టు మిషన్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నడింపల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్దన్, సబిత తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న సమిష్టి సేవా ఫౌండేషన్ సభ్యులు

కట్టంగూర్: మండలంలోని కల్మెర గ్రామానికి చెందిన బెల్లి వెంకన్న నాలుగు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మంచానికే పరిమితమయ్యాడు. బాధిత కుటుంబానికి సోమవారం సమిష్టి సేవా ఫౌండేషన్ ఇన్‌చార్జి గోగు బాలసైదులు బియ్యంతో పాటు 14రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గట్టిగొర్ల యాదగిరి, తండు గిరిబాబు, చిత్తలూరు రాజు, బెల్లి యాదయ్య, చొల్లేటి యాదగిరి, దామోదరచారి ఉన్నారు.

కుల గణన చేపట్టడం హర్షణీయం

కేతేపల్లి: రాష్ట్రంలో కుల గణన నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటం పట్ల టీపీసీసీ నాయకుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, కోట పుల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. కేతేపల్లి మండల కేంద్రంలో సోమవారం బీసీ నాయకులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో బయ్య ముత్తయ్య, జటంగి మల్లయ్య, సైదులు ఉన్నారు.

నాణ్యతకు తిలోదకాలు


రోడ్డు పక్కన మట్టిని తొలగించకుండానే బీటీ వేసిన కాంట్రాక్టర్


కల్వర్టు నిర్మించకుండానే రోడ్డు వేస్తున్న దృశ్యం

- రోడ్డు విస్తరణ పనుల్లో ఇష్టానుసారం వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్
- కల్వర్టు నిర్మించకుండానే రోడ్డు పూర్తి
- డ్రెయినేజీ నిర్మాణం పూర్తికాకపోవడంతో రోడ్డుపైనే నిలుస్తున్న మురుగు
- అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆరోపణ

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ తన ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడు. నార్కట్‌పల్లి పట్టణంలో రూ.16 కోట్లతో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో రోడ్డు విస్తరణ పనులతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2023 మే 28వ తేదీన పనులు ప్రారంభించగా.. 18 నెలల్లో(2024 డిసెంబర్) పనులు పూర్తిచేయాల్సి ఉంది. ఇప్పటికే 7 నెలలవుతున్నా, కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్ననారాయణపురం రోడ్డు నుంచి సీపీఎం కార్యాలయం మధ్య కల్వర్టు నిర్మించకుండానే రోడ్డు వేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిన్న కల్వర్టు ఉండేదని, కానీ ఇప్పుడు కాంట్రాక్టర్ కల్వర్టు లేకుండానే రోడ్డు వేయడంతో శుక్రవారం, శనివారం స్థానికులు ఆందోళన చేపట్టారు. దీంతో పనులను నిలిపివేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవంతో కాంట్రాక్టర్ తన ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి



చిన్ననారాయణపురం రోడ్డు నుంచి సీపీఎం కార్యాలయం మధ్య కల్వర్టు నిర్మించకుంటే రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. కాంట్రాక్టు కల్వర్టు నిర్మించకుండానే రోడ్డు వేస్తున్నాడు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి కల్వర్టు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– అర్రం శ్రీను, నార్కట్‌పల్లి

మట్టి తొలగించకుండానే..

రోడ్డుకు ఇరువైపులా మట్టి పూర్తిగా తొలగించకుండానే బీటీ వేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం పూర్తిచేయకుండానే బీటీ వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నల్లగొండ చౌరస్తాలో డ్రెయినేజీ పనులు పూర్తికాకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై నిల్వ ఉంటుందని, స్థానికులు వాపోతున్నారు. ఇరువైపులా సమానంగా రోడ్డు విస్తరణ చేస్తామని అధికారులు గతంలో రోడ్డుపై ఉన్న దుకాణాలను తొలగించారు. కానీ ఇప్పుడు ఒక వైపు రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే ఉన్న రోడ్డు పైనే బీటీ వేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై అధికారులకు తెలియజేసినా పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం


నకిరేకల్: మర్రూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ముందున్న లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలంలోని తాటికల్, నర్సింహాపురం, మర్రూరు, మోదినిగూడెం, వల్లాభాపురం గ్రామాల్లో సోమవారం రూ.50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ డెవలప్‌మెంట్ కింద నకిరేకల్ నియోజకవర్గానికి విడుదల చేసిన రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాటికల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పలు అభివృద్ధి పనులకు రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, పీఆర్ ఏఈ సంపత్, మండల పంచాయతీ అధికారి నాగలక్ష్మి, సర్పంచులు మాలె పవన్‌రెడ్డి, వలిశెట్టి స్వప్నస్వాం, పడాల సైదులు, మల్లెబోయిన జయమ్మ, ఎంపీటీసీలు గాదగోని శ్రీలతాకొండయ్య, దాసరి వీరార్జున్‌రెడ్డి, షేక్ యాస్మిన్‌నయీం, సాగర్, నాయకులు నకిరేకంటి ఏసుపాదం, నకిరేకంటి నరేందర్, చెనగాని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సర్ ప్రారంభం..

నకిరేకల్‌లోని శాఖా గ్రంథాలయ భవనంలో కీ.శే. వంటిపాక కళ్యాణ్ చక్రవర్తి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వంటిపాక తిరుపతయ్య, నర్సింహామూర్తి బహూకరించిన వాటర్ డిస్పెన్సర్‌ను సోమవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రవి, కాటేపల్లి శ్రీరాములు, వంటిపాక నర్సయ్య పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చేయలేని పనులు చేస్తున్నాం..

నార్కట్‌పల్లి: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి, చిన్నతుమ్మలగూడెం, చిప్పలపల్లి, తొండల్‌వాయి, మాండ్ర, కొండపాకగూడెం, మాధవ యడవెల్లి, నార్కట్‌పల్లి, ఏపీ లింగోటం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుండగోని యాదగిరి, పంచాయతీరాజ్ ఏఈ మోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, సట్టు సత్తయ్య, సర్పంచ్ లు మాదాసు చంద్రశేఖర్, దాసరి రాజు, వలిగొండ కళమ్మ, బింగి కొండయ్య, సామ నరేందర్‌రెడ్డి, దొండ సౌమ్య, తదితరులు ఉన్నారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి


కలెక్టర్ హరిచందనకు మొక్క అందజేస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్: బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామారాజు డిమాండ్ చేశారు. సోమవారం బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరిచందనను కలిసి మొక్కను అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బీసీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రహరి మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు బీసీ సంఘం మద్దతు ఉంటుందన్నారు. బీసీలకు ఉన్న క్రీమీలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని, ఉద్యోగుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా ఉన్న సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కాసోజు విశ్వనాథం, నల్ల సోమమల్లయ్య, శంకర్, నిమ్మల ఇందిర, నిరంజన్, కె. మంజుల, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' కరపత్రం ఆవిష్కరణ


చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండటౌన్: ఢిల్లీలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో నిర్వహించనున్న ధర్నాలో పెద్దఎత్తున బీసీలు పాల్గొని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని పూలే విగ్రహం వద్ద చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరు నారాయణయాదవ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మునాస ప్రసన్నకుమార్, నాగుల వేణుయాదవ్, సింగం లక్ష్మి, మామిడి పద్మ, గుండు వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీనివాస్, వెంకన్న, దుర్గ, తిరుపతయ్య, కృష్ణ, కీర్తి శ్రీనివాస్, స్వామి, రాజేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

నల్లగొండ టూటౌన్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో 'గావ్ ఛలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండల కోఆర్డినేటర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రతి మండలంలోని ప్రతి గ్రామంలో ప్రవాసి కార్యకర్త 24గంటలు ఉండి మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో పార్టీ సోషల్ మీడియా ఉత్సాహంగా పనిచేయాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్, సీనియర్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, పెరిక మునికుమార్, దాసోజు యాదగిరాచారి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి కృషి చేయాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఐఈఓ దస్రూనాయక్ తదితరులు

నల్లగొండ: ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) దస్రూనాయక్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని డీఐఈఓ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు పొందేలా అధ్యాపకులు తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈటూరు రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి సిలివేరు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి బత్తుల సాయిలు, కోశాధికారి సీహెచ్. వెంకటయ్య, సుచరిత, ఉపాధ్యక్షులు పూర్ణచందర్, ఎ. రమాదేవి, ప్రసన్నలక్ష్మి, ఎస్. హరికృష్ణ, ముత్యం వెంకన్న, ఎస్. శ్రీనివాస్, జయప్రకాష్, నారాయణ పాల్గొన్నారు.

ఇసుక లారీల తనిఖీ

నకిరేకల్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారుజామున నకిరేకల్‌లో ఇసుక తరలిస్తున్న లారీలను తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు తనిఖీ చేశారు. ఇసుక తరలింపునకు సంబంధించిన అనుమతి పత్రాలను పరిశీలించారు. ఎవరూ కూడా అక్రమంగా ఇసుక తరలించడం లేదని నిర్ధారించుకుని లారీలను పంపించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కొప్పోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

కనగల్: గుర్రంపోడు మండలం కొప్పోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం కనగల్ మండలం దర్వేశిపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చాలాకాలం తర్వాత కలిసిన మిత్రులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సింగం ప్రవీణ్, హరిబాబు, శేఖర్, దయానంద్, విజయ్, రాధ, శ్రీదేవి, వెంకటయ్య, పరమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు సన్మానం


సర్పంచ్ నగేష్, పాలకవర్గ సభ్యులను సన్మానించిన లెంకలపల్లి గ్రామస్తులు

మర్రిగూడ: మండలంలోని లెంకలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పాక నగేష్‌యాదవ్‌తో పాటు పాలకవర్గ సభ్యులతో సోమవారం గ్రామస్తులు సన్మానించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకోవడంతో వారు గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, వార్డు సభ్యులు ఏర్పుల వెంకటేష్, గొట్టిముక్కల అబ్బమ్మ, పల్లె వెంకటేశం, ఐతగోని యాదయ్య, కందికంటి రేణమ్మ, నందికొండ అలివేలు, చాంపల రవి, అబ్బనబోయిన నరేష్, పెంబల్ల అనిత, కొప్పుల యాదమ్మ, కందికంటి స్వామి, పగిళ్ల సత్యనారాయణ, తిప్పర్తి జయమ్మ, అబ్రాబాద్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కాల్వ నిర్మించే భూముల పరిశీలన


వట్టిమర్తిలో భూముల పరిశీలనకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న రైతులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులో ఉదయ సముద్రం ప్రాజెక్టు కాల్వ నిర్మాణంలో భాగంగా రైతులు కోల్పోతున్న భూములను సోమవారం డీఈ శ్రీనివాస్, ఈఈ సత్యనారాయణ పరిశీలించారు. అధికారులు వచ్చిన విషయం తెలుసుకున్న గ్రామ రైతులు అక్కడికి చేరుకున్నారు. కాల్వ నిర్మాణంతో తమ విలువైన భూములు పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని అధికారులను రైతులు కోరారు. దీంతో స్పందించిన అధికారులు భూ పరిహారంపై జిల్లా కలెక్టర్‌తో చర్చించిన తర్వాతే కాల్వ నిర్మాణ పనులు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు.

చిన్నప్పటి నుంచే ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి


స్పెల్ విజార్డ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామగిరి(నల్లగొండ): చిన్న వయస్సు నుంచే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ మండల కన్వీనర్ నూనె విష్ణు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో తిప్పర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం వివిధ పాఠశాలల్లోని 8, 9వ తరగతుల విద్యార్థులకు మండల స్థాయి స్పెల్ విజార్డ్, నాటక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆంగ్ల భాష సామర్థ్యాలను తెలుసుకునేందుకు గాను పరీక్ష నిర్వహించారు. అనంతరం ఆంగ్ల భాషలో నాటకాలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో తిప్పర్తి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పానుగోతు నర్సింహ, బైరం శ్రీనివాస్, నర్రా దామోదర్ రెడ్డి, జ్యోతిర్మయి, షకీలా, భాను, కిరణ్, శాంసన్, సుధ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలని వినతి

నల్లగొండ: కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ సంఘం నాయకులు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేజీబీవీ, యుఆర్‌ఎస్, సమగ్ర శిక్ష, గిరిజన సంక్షేమ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రికి విన్నవించారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్ అమలు, బీసీ గురుకులాల పని వేళలు ఇతర గురుకులాలతో సమానంగా మార్చాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి, మాణిక్‌రెడ్డి ఉన్నారు.

ఎంపీ బడుగుల ఇంట్లో విషాదం


బడుగుల లింగయ్యయాదవ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, గాదరి కిషోర్ తదితరులు

కేతేపల్లి: ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ నాయనమ్మ బడుగుల శ్రీరాములమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో మృతిచెందారు. శ్రీరాములమ్మ మృతదేహాన్ని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, యాదాద్రి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బడుగుల లింగయ్యయాదవ్, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో స్థానిక సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్, ఎంపీటీసీ బడుగుల రవీందర్, నాయకులు బడుగుల ఉపేందర్, జశ్వంత్, మురళయ్య, నరేందర్, చిముట వెంకన్న తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ

నల్లగొండటౌన్: బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు ఆశ వర్కర్లు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి. మహేశ్వరి, ఏర్పుల యాదయ్య, తవిటి వెంకటమ్మ, బి. అనూష, జి. విమల, టి. పార్వతమ్మ, కోరె లలిత, ఆర్. శైలు, ప్రేమలత, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణస్వీకారం

నకిరేకల్: పట్టణంలోని గీతా మందిరం నూతన కమిటీ ప్రమాణస్వీకారం సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా పబ్బతి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరు వెంకటేశ్వర్లు, కోశాధికారిగా వీర్లపాటి కొసల్యాజానయ్య ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు వీర్లపాటి జయమ్మ, ప్రతినిధులు సోమ సక్కుబాయమ్మ, మంచుకొండ సోమయ్య, ఉప్పల రమేష్, గుండా వెంకటయ్య, గుండా అరుణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయం


సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ చిట్యాల సబితాయాదగిరిరెడ్డి అన్నివిధాలుగా సహకరించడం అభినందనీయమని ఎంఈఓ గురువారావు అన్నారు. సోమవారం పాఠశాలలో సర్పంచ్ దంపతులను ప్రధానోపాధ్యాయుడు కె. జనార్దన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలను ప్రగతిపథంలో నడిపించినందుకు సర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్లను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ ఐతరాజు లింగస్వామి, ఉపాధ్యాయులు జె. భిక్షమయ్య, యాదగిరి, వెంకటేశ్వర్లు, సుజాత, సక్కుబాయి, పూర్వ విద్యార్థులు ఊరిపక్క మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

శాలిగౌరారం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు గాను పట్టభద్రులు ఫారం–18 ద్వారా ఓటు నమోదు కోసం దరఖాస్తులు చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాకాల సతీష్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు ఫిబ్రవరి 6 చివరి తేదీ అని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని లేని పక్షంలో ఫారం–18ని నింపి తహసీల్దార్ కార్యాలయంలో కూడా అందజేయవచ్చాన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ పరమేశ్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు లొడంగి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా చట్టాన్ని అమలు చేయాలి

శాలిగౌరారం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు వికాస సమితి మండల ప్రధాన కార్యదర్శి పోతుగంటి సైదులు సోమవారం తహసీల్దార్ పాల్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం గురించి తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని కోరారు. పౌరులు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా అందించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

నాంపల్లి: గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ శ్వేత అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులు శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. మరో రెండు రోజుల్లో సర్పంచులు పదవీకాలం ముగియనుండడంతో 32 గ్రామాల సర్పంచులను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ దేవ్‌సింగ్, ఎంపీడీఓ శేషుకుమార్, సర్పంచులు చందుయాదవ్, చంద్రారెడ్డి, శ్రీలత, కవిత, దివ్యగోవర్ధన్‌రెడ్డి, సురేందర్, విష్ణు తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకన్న అన్నారు. సోమవారం మునుగోడు పెద్ద చెరువులో ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం కూలీలకు రోజుకు కనీసం రూ.500 చెల్లించాలని కోరారు. రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.